

అరవింద

'కవిక'

"అమ్మా!" బాధతో మూలిగాడు పసివాడు.

నిండా కట్లతో ఉన్న ఆ పసివాని వైపు జాలిగా చూసి మత్తుమందు సిరంజిలోకి ఎక్కించి జబ్బమీద రవంత చోటు చూసి ఇంజక్షన్ చేసింది, డ్యూటీలో ఉన్న నర్సు. క్షణంలో మత్తులోకి జారిపోయాడు ఆ పసివాడు.

అవి విజిటింగ్ అవర్సు కావడంతో వార్డులన్నీ జనంతో సందడిగా ఉన్నాయి.

"సిస్టర్! బాబుకి ఎలా ఉంది?" లోపలకు వస్తూ అడిగింది సరళ.

"రక్తం బాగాపోయింది. అప్పుడే ఏ మాటా చెప్పడం కష్టం. కేసు చీఫ్ టేకప్ చేశారు. ఫరవాలేదనేఅనిపిస్తోంది."

"అంతా ఆ భగవంతుని దయ," అంది సరళ చంకలోని బిడ్డను చక్కజేసుకొంటూ.

"నిజంగా మిమ్మల్ని మెచ్చుకోవాలి.

చాలామంది తల్లులు నానా గోలాచేసి, మాకేమీ తోచకుండా చేస్తారు. అందరూ మీలా ఇలా ధైర్యంగా నిలబడితే ఎంత బాగుండును !"

నర్సు మాటలకు నొచ్చుకొంది సరళ. "బిడ్డ కాలిగోరు కందితే తల్లి ప్రాణం గిలగిలలాడిపోతుందే అలాంటిది బిడ్డఇలా చావుబ్రతుకుల మధ్య కాపాడుతుంటే తల్లి కింక యుక్తాయుక్తాలు ఏం తెలుస్తాయి ? మీకు అనుభవంలేక అలా అనగలిగారు."

ఆ మాటలు చురుక్కుమనిపించడంతో నర్సు ముఖంలో రంగులుమారాయి.

"అయితే మీ కిప్పుడింత నిబ్బరం ఎలా వచ్చింది ?" అని ప్రశ్నించింది నర్సు.

"పాపం ! ఈ నిర్భాగ్యుడు తల్లి ప్రేమకు నోచి పుట్టలేదు. సమయానికి తండ్రికూడా కాంపుకి వెళ్లాడు. ఇంతలో ఈఅవాంతరంవచ్చిపడింది. పక్క పక్క ఇళ్ళు కావడంతో వీడు మా వాళ్లతో ఆడుకొంటూ ఉండేవాడు. ఆ చనువు వేత చూస్తూ వదిలెయ్యలేక తీసుకు వచ్చి ఇక్కడ చేర్పించాము.

ట్రైసికిల్ నడుపుతూ మేడమెట్లమీద నుండి దొర్లిపోయాడు. వెంటనే బాధ్యత తెలియని కుర్రనౌకరు కంగారుపడి పారిపోయాడు. మా పిల్లలు వచ్చి చెప్పగానే పరుగెత్తా. మెట్లకింద నెత్తురు మడుగులో దొగాడుతున్నాడు. పాపం ! ముసలినౌకరు చచ్చిపోవడంతో వచ్చాయి తిప్పలు. అసలు తల్లే ఉంటే వీడికి ఈ గోడే ఉండేది కాదు. వీడు మరీ పసి వాడుగా ఉన్నప్పుడే,తల్లి లేచిపోయిందని కొందరు, చచ్చిపోయిందని కొందరూ చెపుతూంటారు. ఏది ఏమైతే నేమి ఆ మహానుభావుడు మళ్ళీ పెళ్ళి మాట తలపెట్టకుండా ఈ బిడ్డతోడిదే లోకంగా బ్రతుకుతున్నాడు. ఆతనికి టెలిగ్రాం పంపాము.అందగానే రెక్కలు కట్టుకొని వచ్చి వాల్తాడు. పాపం ! ఏం రాసి ఉందో " సానుభూతితో నిట్టూర్చింది సరళ.

ఆర్డర్లీ కేసురిపోర్టు తెచ్చి గదిలో తగిలించి వెళ్ళాడు వాటి చూసుకొని కంగారుపడింది సరళ.

"సిస్టర్ ! నేను వెళ్ళాలి. వాళ్ళ నాన్న వచ్చేదాకా ఈ బాబుకి తల్లైనా తండ్రి అయినా మీరే ఖర్చుకు వెనకాడ వలసిన పనిలేదు. బిడ్డ బాగుంటే చాలు. జాగ్రత్తగా కనిపెట్టి చూడండి. సాయంకాలం మావారు వచ్చి చీఫ్‌తో మాట్లాడు తారు. ఇక నేను ఉంటా" అంటూ అప్పగింతలు పెట్టి వెళ్ళిపోయింది.

నర్సు మంచందగ్గరకు వెళ్ళి, అచేతనంగా పడిఉన్న ఆ పసివాడివైపు తదేకంగా చూస్తూ నిలబడింది. అప్రయత్నంగా ఆమె కళ్లు చెమ్మగిల్లాయి. "తల్లిగా అనుభవం లేదు

తాబోలు" అన్న సరళ మాటలే తలపుకు వచ్చి బాధగా నిట్టూర్చింది ఆమె.

"ఈ పసివాడి తల్లి ఎవరో? ఎంత తప్పనిసరి పరిస్థితులలో ఆమె ప్రాణాధికమైన బిడ్డను విడిచి వెళ్ళిపోయిందో-అది ఎవరికీ పట్టదు కదా!"

మూగగా రోదించింది ఆమె హృదయం. చెదరిన మనసును అదుపులోకి తెచ్చుకొని రోగి స్థితిని గురించిన వివరాలు తెలుసుకోవాలన్న కోరికతో కేసురిపోర్టు చేతిలోకి తీసుకొంది. వెంటనే షాక్ తిన్నదానిలా మంచం పక్కన కూలబడి పోయింది.

* * *

సృష్టికంతకు ఆధారభూతమైనది తల్లి ప్రేమ. బిడ్డల్ని కని, పెంచి, ప్రయోజకులుగా చెయ్యడంకోసం తల్లి-ప్రాణి పడే తాపత్రయం ఎంతటిదో మనం పశుపక్ష్యాదుల్లో కూడా చూస్తూనే ఉంటాము. ఎటొచ్చీ పశువులకు విలక్షణంగా మానవులు ప్రాజ్ఞులై తిరిగి తల్లిదండ్రుల్ని ఆదుకోవాలి. తండ్రి పోయినప్పటినుంచి రాత్రనక పగలనక కష్టించి పిల్లల్ని పెంచినది తమ తల్లి. తొలి జీతం అందుకోగానే ఆమె నింక వంటపనికి వెళ్లనివ్వకూడదు. శక్తికి మించిన శ్రమ కావడంచేతనే ఆమెకు జబ్బుచేసింది. ఇంక విశ్రాంతి నివ్వాలి-అనుకొంది తల్లి మంచాన్నే కనిపెట్టుకొని ఉన్న అరవింద.

పక్క వాటాలోని గడియారం వరుసగా తొమ్మిది గంటలు కొట్టింది.

"అమ్మలూ!" పిలిచినట్లయి తల ఎత్తిన అరవింద, తల్లి కళ్ళు తెరచి ఉండడంచూసి సంబరపడింది.

"అమ్మలూ! ఎంతే గంటి కొట్టింది" అని అడిగింది కమలమ్మ. బహునీరసంగా వుంది మాట

మూడురోజులనుండి నోట మాట లేకుండా పడిఉన్న తల్లి కళ్లుతెరిచి ఆ పాటిగానైనా మాటాడగలిగినందుకు సంతోషించారు పిల్లలు ముగ్గురూ.

"అమ్మా!" అంటూ దగ్గరగా వచ్చాడు ప్రసాద్.

"తొమ్మిదయిందమ్మా" అంది దగ్గరే ఉన్న కళ్యాణి.

"అప్పుడే తొమ్మిదయిందా! బిందూ, అలాగే ఉన్నావేమే, ఆఫీసుకు వెళ్ళవా?" అంటూ లేవబోయింది కమలమ్మ. కాని లేవలేక వెనక్కువాలిపోయింది. "అబ్బా! ఈ కాస్త జ్వరానికేఇంత డీలాపడిపోయానేమిటి?" అనుకొంటూ ఉస్సురంది.

"కొంచెమూ! జ్వరం పేలిపోతేను! ఈ మూడు రోజులనుంచీ నువ్వు కళ్లైనా తెరవలేదు-అక్క ఆఫీసు మానేసింది. నాకు ఎంత భయమేసిందో" తల్లి మెడ చుట్టూ చేతులువేసి ఒదుగులు పోయింది కల్యాణి.

"బిందూ! సెలవు చీటీ వ్రాశావా ?" తల్లి అడిగింది.

కేలండర్ వైపు చూసిన అరవింద ఒక్కసారిగా కంగారుపడిపోయింది. తన బెంగలో తానుండి సెలవుచీటీ వ్రాయ లేదు సరిగదా చంద్రమోహన్ టైపు చెయ్యమని ఇచ్చిన థీసిస్ కాగితాలు కూడా తాను తిరిగి ఇవ్వలేదు. రేపే అతని ప్రయాణం! ఎలాగ! ఆ కాగి తాలు కూడా తన డెస్కులోనే ఉన్నాయి. తాళాలూ తన దగ్గరే ఉన్నాయి. మూడువంతులు టైపు చెయ్యడం అయ్యింది. ఇంకా ఒకవంతు ఉంది. ఇప్పుడైనా ఆ కాగితాలు అతనికి అంద జెయ్యడం మంచిది-అనుకొన్న అరవింద తల్లికి ఆ విషయం చెప్పింది.

కమలమ్మ నొచ్చుకొంది. "ఉద్యోగం నిలుపుకొనే లక్షణాలు ఇవికావే. ఆ కాగితాలు పూర్తిచేసి ఇచ్చేసిరా. నా కీవేళ బాగానేఉంది. బాబ్జీ, కల్యాణీ ఉంటారుగా, నువ్వు వెళ్ళిరా" అంటూ తొందరచేసింది.

* * *

ఇంటిదగ్గర సర్దుబాట్లన్నీ చూసుకొని ఆఫీసుకు చేరుకొనేసరికి ఒంటిగంట అయ్యింది. అరవింద గుమ్మంలోకి రాగానే ఎదురు వచ్చిన చంద్రమోహన్ "మూడురోజులనుండీ రాలేదేం ? థీసిస్ టైప్ చేశారా?" అంటూ ఆత్రంగా ప్రశ్నించాడు.

వేళకు సరైన నిద్రాహారాలు లేక పాలిపున్న ఆమె చెక్కిళ్ళలోకి వెచ్చని ఆవిర్లు వచ్చాయి. తలవంచుకొని "హఠాత్తుగా మా అమ్మగారికి చాలా జబ్బుచేసింది.అందుకని రాలేకపోయాను. మీ థీసిస్ మూడువంతులు పైగా అయి పోయింది. తక్కినది ఇప్పుడు టైప్‌చేసి ఇస్తా" అంది.

భారంగా వాలిపోతున్న ఆమె సోగ కళ్లనూ, కెంపెక్కిన చెక్కిళ్లనూ, తడ బాటుతో కంపించే అధరాలనూ ఒక్క క్షణం రెప్పవాల్చకుండా చూసి చూపులు మరల్చుకొన్నాడు చంద్ర మోహన్

"సరే, త్వరగా మొదలుపెట్టండి. నా ప్రయాణం రేపే. ఈ వేళ ఆఫీసు వర్కు ఏమీ చూడవద్దు. ఈ ఒక్కపనీ పూర్తిచేసి కాగితాలు అప్పగించి వెళ్లండి" అని చెప్పి వెళ్లిపోయాడు.

మూడురోజుల క్రితం 'అర్జంటు' అంటూ ఇచ్చిన కాగితాలు అవి ఇంక అట్టేలేవు. పని నీట్‌గా చేసి అప్పగించి మరీ వెళ్ళాలి-అనుకుంది అరవింద.

లంచి టైంకి వచ్చి చూసిన చంద్ర మోహన్ ఆమె ఏకాగ్రతకు విస్తు పోయాడు. అతడు వచ్చినదైనా గమ నించకుండా ఏకబిగిని పేజీలకు పేజీలు టైపుచేస్తోంది అరవింద. కాగితాలు మార్చవలసి వచ్చినప్పుడు తప్ప ఆమె మిషనుకి క్షణమైనా విరామం ఇవ్వటం

లేదు. అలసట ముఖంమీద కొట్టవచ్చి నట్లుగా కనిపిస్తోంది. చెమట బిందువులు ముత్యాల జాలరుల్లా ఆమె ముఖాన్ని ఆవరించి మెరుస్తున్నాయి. సన్నని అంగుళులు మెరపుతీగల్లా వేగంగా కీ బోర్డుమీద కదులుతూ కళ్లు మిరిమిట్లు గొల్పుతున్నాయి. ఆ భంగిమలో ఆమెను చూడగానే ఇదివరకెన్నడూ ఎరుగని విధంగా అతని గుండె స్పందించింది. బలవంతంగా చూపులు మరల్చుకొని అతడు బయటకు వెళ్లిపోయాడు.

ఆఖరు పేజీకూడా టైప్ చెయ్యడం అయ్యింది. పేజీలన్నీ బొత్తిగా పేర్చి మిషన్ మూసి లేచి బడలికగా ఒళ్లు విరుచుకొంటూ గడియారం వైపు చూసిన అరవింద త్రుళ్లిపడింది. గడియారం 8 గంటలు చూపిస్తోంది. ఇంటి దగ్గరి పరిస్థితులు ఆమెను కలవరపరచాయి. త్వరగా ఇంటికి చేరాలని తహతహలాడింది.

భోజనానికి పోయాడు గావును, ఎంత పిలిచినా ప్యూన్ పలుకలేదు. అరవింద మేడమీది దీపం దేదీప్యమానంగా వెలిగి పోతూ ఉండడం చూచి 'ఈపాటికి అతను క్లబ్‌నుండి వచ్చేఉంటాడు" అనుకొంది. తను వెళ్ళి ఈ కాగితాలు అతనికి అప్పగించేస్తే తన పూచీ తీరి పోతుంది; ఇంటికి వెళ్ళిపోవచ్చునన్న తొందరలో అరవింద ఆ కాగితాల దొంతర మోసుకుంటూ మేడమెట్లు ఎక్కడం మొదలుపెట్టింది.

గుమ్మందగ్గర నిలచి 'సార్" అంటూ బెరుకుగా పిలిచింది అరవింద.

వెంటనే 'కమిన్' అన్నమాట విని పించడంతో తెరిపినపడ్డ మనసుతో ఒంటినిండుగా కొంగు కప్పుకొని నెమ్మదిగా అడుగులు ముందుకువేసింది.

అది విశాలమైన హాలు. అందరి భాగ్యవంతుల ఇళ్లలాగే అదీ అధునాతనమైన ఫర్నిచర్‌తో గృహమేధి అభిరుచిని వ్యక్తంచేస్తూ తీరుగా అలంకరించబడి ఉంది. గోడవారగా ఉన్న టేబుల్‌మీద వ్రాతపరికరాలు, కాగితాలు పేర్చి ఉన్నాయి. అక్కడ ఉన్న కుర్చీలో తల ఒల్లకు ఆన్చుకొని కూర్చుని ఉన్నాడు చంద్రమోహన్.

"సార్! థీసిస్ తెచ్చా" అంది అరవింద చేతిలోని కాగితాల దొంతర చూపుతూ.

అతడు వాల్చిఉన్న తల భారంగా పైకెత్తి అరవిందవైపు వెర్రిగా చూశాడు. మత్తుగా తనవైపు చూస్తున్న ఎర్రని కళ్లనూ, చిందరవందరై ఉన్న జుట్టునూ, ఆ ముఖంలో ద్యోతకమవుతున్న భావాన్ని చూసి గతుక్కుమంది. అరవింద కంగారుగా థీసిస్ బల్లమీద ఉంచి గుమ్మంవైపుగా పరుగెత్తింది. ఆమె గుమ్మాన్ని చేరిందో లేదో, అతడు ఒక్క అంగలో అందుకొని, ఒక్క

ఊపులో ఆమెను ఇవతలకు లాగి తలుపును దగ్గరగా నెట్టాడు. పెద్ద చప్పుడుతో మూసుకుపోయింది ఆ తలుపు. వెంటనే బిగుసుకుపోయింది ఆటోమెటిక్ లాక్.

అప్పుడే మెట్లదగ్గరకు వచ్చిన ఫ్యూన్ వెంకన్న కళ్లబడి ది ఆ దృశ్యం. ఒక్క పరుగున మెట్లన్నీ గడిచి వచ్చి తలుపును దబదబా బాదడం మొదలు పెట్టాడు.

"బాబూ! కన్నెపిల్ల. అన్యాయం చెయ్యకండయ్యా. బాబూ! ఇది మీకు తగిన పనికాదు. రక్షించండి బాబూ! బాబూ!" అంటూ గోలగా అరుస్తూ తలుపులు మోదసాగాడు. కాని అతని వంతా అరణ్యరోదనమే అయ్యింది. లోపలనుండి అంతవరకు వినిపిస్తున్న గందరగోళం ఆగిపోగానే ఉసూరుమని అక్కడే కూలబడిపోయాడు వెంకన్న.

హఠాత్తుగా స్పృహలోకి వచ్చి కళ్ళు తెరచి చూసిన అరవిందకు కొంత సేపటివరకు ఏ స్ఫురణ లేకుండా పోయింది దేదీప్యమానంగా వెలుగుతున్న దీపపు కాంతిలో పరిసరాలను గమనించిన ఆమెకు నెమ్మదిగా అంతా గుర్తుకురావడం మొదలుపెట్టింది. పాల రాతితో చెక్కబడిన గ్రీక్ శిల్పంలా, తన ప్రక్కనే పడుకొని గాఢనిద్రలో సొక్కిఉన్న చంద్రమోహన్‌ని చూసే సరికి ఆమె అంతులేని దుఃఖంతోనూ, భయంతోనూ వణికిపోయింది. అతడు లేవకముందే తాను అక్కడినుండి పారి పోవాలని కంగారుపడింది. తొందరగా, చెదిరిఉన్న రూపాన్ని చక్కదిద్దుకొని, నెమ్మదిగా తలుపు తెరచుకొని కష్యాంతరాలన్నీ గడిచి వీధినిపడిఅరవింద వేగంగా ఇంటివైపు పరుగెత్తడం మొదలు పెట్టింది

అర్ధరాత్రి నిర్మానుష్యంగా ఉన్న వీధులవెంట తన్ను తానెరుగకుండా పరుగెత్తుకొంటూ వచ్చి ఇంటిని చేరుకొన్న అరవింద ఇంటి తలుపులు తెరిచి ఉండడమూ దీపపు వెలుగు హెచ్చుగా ఉండడమూ చూసి కంగారుపడి ఒక్క అంగలో తల్లి మంచాన్ని చేరుకొంది.

ఎక్కిళ్ళతో ఇంతెత్తున ఎగిరిపడుతున్న తల్లిని చూసి "అమ్మా ! ఏమిటే ఇది ?" అంటూ రెండుచేతులా తల్లిని పొదుపుకొని మనసులోని గుబులు ఎగదన్నగా భోరున ఏడ్చేసింది అరవింద.

"అక్కా ! నీ కోసమే చూస్తున్నా. నువ్వు వచ్చేశావుగా, నేను డాక్టర్‌ని తీసుకువస్తా" అంటూ మరి మాటకోసం ఎదురుచూడకుండా పరుగెత్తాడు ప్రసాద్.

తన్ను తాను సంబాళించుకొని, తల్లి మంచాన్ని కరచుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్న చెల్లెల్ని దగ్గరకు తీసుకొంది అరవింద "కల్యాణీ ! ఏడవకు. అమ్మచూస్తే బాధపడుతుంది. బాబ్జీ



డాక్టర్ని తీసుకొస్తాడుగా, అమ్మకు నయమైపోతుంది. నా బంగారువు కదూ! నువ్వెళ్ళి దొడ్డమ్మగారిని లేపుకురా. మనకు సాయంగా ఉంటారు" అంది.

చెల్లెలు అటు వెళ్ళగానే ఇక నిగ్రహించుకోలేకపోయింది అరవింద. "అమ్మా! అన్యాయమైపోయానే" అంటూ తన దుఃఖాన్ని వెళ్ళబోసుకొని తల్లిఒడిలో ఓదార్పు పొందాలని గంపెడాశతో తను ఇంటిని వెతుక్కుంటూ వస్తే తల్లి పరిస్థితి ఇలా అయోమయంగా ఉంది. తమకు తల్లి అసలు దక్కేట్టునా!?

గుండె లవియజేసే బాధను బలవంతంగా నిగ్రహించుకొనే ప్రయత్నంలో ఆమె నిలువునా వణికింది. చెంపల వెంట కన్నీటిధారలు కారిపోతూ ఉండగా ఎలాగైనా తల్లికి కాస్త ఉపశమనం కలిగించాలని శుష్కించి ఉన్న ఆ గుండెలమీద మెల్లగా రాస్తూ తాపత్రయ పడడం మొదలుపెట్టింది అరవింద.

కాని ఆ తల్లి ఇవేమీ తెలుసుకోగల స్థితిలో లేదు. ఒకవిధమైన మాంద్యం ఆమెను క్రమ్మిఉంది. తెరలు తెరలుగా ఎగిరిపడుతున్న శరీరోద్వేగమే తప్ప ఇతరమేమీ ఆమెకు తెలియటంలేదు. ఆ సమయంలో శీలాన్ని కోల్పోయి దిక్కు-

చక అసహాయంగా దుఃఖిస్తున్న కూతురు స్థితి ఆమెకు తెలియనే తెలియదు. ఈ భవబంధాలనుండి విముక్తికోసం పెనుగులాడుతోంది జీవం.

కల్యాణి వెంట వచ్చిన రాజమ్మ, కమలమ్మ పరిస్థితి చూసి కంగారు పడింది.

"అదేమిటే ! అలా చూస్తూ ఊరు కొన్నావు — ప్రాణం కంఠంలో గుర గురమంటూ ఉంటే భూశయనం చేయించవద్దా ! ఇల్లు మయిలపడి పోదూ ! లేవండి - అమ్మడూ ! ఆ పాత చాప అందుకొని వీధివార పరచ్వే అరవిందా! నువ్వు కాళ్లదగ్గర పట్టుకో. నారాయణ నారాయణ -" అంటూ రోగి తల పట్టుకొని దబ్బున లేవదీసింది రాజమ్మ.

"డాక్టరు ఇప్పుడు రానన్నారు. రేపు అమ్మనే ఆసుపత్రికి తీసుకు రమ్మన్నారు" అని చెప్పడం ఎలాగా అని బాధపడుతూ ఇల్లు చేరిన ప్రసాద్‌కు ఇంక ఆ అవసరమే లేకిపోయింది. తన చుట్టూ చేరి దారుణంగా విలపిస్తున్న బిడ్డలవైపు జాలిగా ఒక్కచూపు చూసి కళ్లు మూసుకొంది కమలమ్మ. కడసారం మూతలుపడ్డ ఆ కళ్ళు మరి తెరవబడ లేదు.

* * *

తెల్లవారేసరికి గుమ్మంలో కారు దిగిన రఘురామయ్య, తలుపులన్నీ బారుగా తెరచి ఉంచి కటిక నేలమీదపడి నిద్ర పోతున్న వెంకన్నను చూసి కోపంతో కేకలు వెయ్యడం మొదలుపెట్టాడు.

ఆ సందడికి మెలకువ వచ్చిన చంద్రమోహన్ ఉన్నపళంగా నీళ్లగది లోకి పరుగెత్తి తలుపులు మూసు కొన్నాడు. తన దగ్గరఉన్న తాళం చెవితో తలుపుతెరిచి మేడమీదకు వచ్చిన రఘురామయ్య ఆ గదిఉన్న తీరు చూసి దిగ్భ్రాంతుడయ్యాడు. నేలంతా చిట్లిపడి ఉన్న ఎర్రగాజుముక్కలు కనుల్రెరజేసి తనను సంజాయిషీ అడుగుతున్నట్లుగా భావించి అతడు కించపడ్డాడు. తన ఏకైక పుత్రుడు అందరికీ మిన్నగా, చుక్కల్లో చంద్రుడిలా ప్రకాశించాలని కోరుకొన్నాడేగాని — ఇప్పుడిప్పుడే పరి పూర్ణత్వాన్ని సంతరించుకొంటున్న ఆ నునులేత హృదయంలో ఏ యే ఆశలు పుడుతూ ఉంటాయో, ఏ యే కోరికలు ఊరుతూ ఉంటాయో ఏనాడూ తాను ఆలోచించినపాపాన పోలేదు. నిండు జవ్వనం తొందరచేయగా తన కొడుకు నిన్న రాత్రి ఏ విలాసి కౌగిలిలోనో గడిపిఉంటాడు. ఇంక ఉపేక్ష చెయ్య కూడదు. తిరిగి రాగానే వీడి పెళ్ళి చేసెయ్యాలి —— అనుకొంటూ తనలో తను నవ్వుకొన్నాడు.

గాజు ముక్కలన్నీ పోగుగా తుడు స్తున్న వెంకన్న నుద్దేశించి - "ఇదిగో వెంకన్నా ! ఈ గది వాటం చూస్తుంటే

ఇక్కడ ఏదో కథ జరిగినట్లుగా ఉంది. నీ కేమైనా తెలుసా ?" అని అడిగాడు

ఆ అవకాశం కోసమే ఎదురు చూస్తున్న వెంకన్న వెంటనే చెప్పడం మొదలుపెట్టాడు - "వట్టి కథ కాదు బాబయ్యా ! చాలా ఘోరమైన కథ జరిగిపోయింది. తమరు క్షమించాలి. చినబాబు తప్పేమీలేదు. తప్పంతా ఆ వయసుది."

ఇంకా ఉపోద్ఘాతమైనా పూర్తికాక ముందే "హల్లో చాంద్ ! హౌ డు యు డు?" అంటూ వచ్చిపడ్డారు చంద్రం స్నేహితులు

* * *

బాత్‌రూమ్‌లో ప్రవేశించిన చంద్ర మోహన్ టాప్ తిప్పి షవర్ ఓపెన్ చేశాడు చలివెచ్చని నీళ్ళు జల్లుగా కురుస్తూంటే గడచినరోజు సంఘటన లన్నీ ఒక్కొక్కటిగా తీయని కలలా గుర్తుకురావడం మొదలుపెట్టాయి. 'ఈవెనింగ్ స్టార్' లో కాక్‌టెయిల్‌పార్టీ, కాబరే డాన్సు – అంతా ఏమిటో అపూర్వమైన అనుభవం రాత్రి-ఎవరు తన ఎదుట నిలచిన అప్సర !? అంతా మధురమైన కల – అనుకొన్నాడు చంద్రమోహన్.

కాని అతని శరీరంమీద అక్కడక్కడా ఎఱ్ఱగా విచ్చుకొని, నీరు తగలగానే మంటపుట్టి సలుపుతున్న గోటిచారికలు జరిగినదంతా కలగా భావించనీయడం లేదు. అందమైన కళ్ళు రెండు భయంతో, దుఃఖంతో. అసహ్యంతో తనవైపు చూస్తున్నట్టు అనుభూతి కలిగి అతడు ఒక్క క్షణం ప్రమాన్పడి ఉండిపోయాడు. ఆలోచించినకొద్దీ తలదిమ్ము మరింతగా పెరిగిపోతోందే తప్ప అతనికి ఏమీ గుర్తుకు రావడంలేదు. అయినా తీరు బడిగా ఆలోచించే వ్యవధి మాత్రం ఎక్కడ ? పదకొండు అయ్యేసరికల్లా అతను ఏరోడ్రమ్‌లో ఉండాలి. తొందరగా స్నానం పూర్తిచేసి, నీటుగా ముస్తాబై బయటికి వచ్చాడు చంద్రమోహన్

* * *

బొంబాయిదాకా వెళ్ళి కొడుకును "బోయింగ్ జట్"తో ఎక్కించి కను చూపుమేర సాగనంపి తిరిగి వచ్చాడు రఘురామయ్య వరసకూ అశ్రద్ధ జరగ డంతో ఆఫీసుపని పేరుకుపోయింది. అర్జంటుగా పంపవలసిన కాగితాలు ఎంచి టైపు చెయ్యడానికి పంపించాడు.

టైపిస్టు వారంనుండి ఆఫీసుకు రావడంలేదనీ సెలవైనా పంపలేదనీ తెలిసి మండిపడ్డాడు రఘురామయ్య.

"ఆ అమ్మాయికి ఈ ఉద్యోగం ఇష్టం అవునో, కాదో అడిగి, రాదలచు కొంటే వెంటనే రమ్మని చెప్పి వెంట తీసుకురా" అంటూ వెంకన్నకి పురమా యించాడు.

"బాబూ ! ఆ అమ్మాయి ఇంటికి

వెళ్ళాలంటే నాకు ముఖం చెల్లటం లేదండీ" అంటూ నీళ్ళు నములుతూ నిలబడిపోయాడు వెంకన్న.

"నువ్వేం చేశావురా అపచారం" అంటూ విసుక్కున్నాడు రఘురామయ్య.

వచ్చిన అవకాశం జారవిడుచుకో లేదు వెంకన్న. "అపచారం జరిగి పోయిందండయ్యా, చాలా పెద్ద అపచారం. ముసలిముండావాణ్ణి బ్రతికి ఉండీ ఏమీ చెయ్యలేకపోయాను. కన్నె పిల్ల అన్యాయమైపోయిందు. తలుచు కొంటే నా గుండెలు పగిలిపోతున్నా యండి" అంటూ గుడ్లనీరు కుక్కు కొంటూ తను చూసిందంతా వివరిం చాడు.

నీరుకారిపోయాడు రఘురామయ్య. "ఎంతపని జరిగింది వెంకన్నా! అప్పుడే చెప్పలేకపోయావా? ఇంత జాప్యం చేశావెందుకు" అంటూ నొచ్చుకున్నాడు.

"అప్పుడే తమరికి చెప్పాలనుకొన్నా. కాని ప్రయాణం హడావిడిలో సందు దొరకలేదు బాబూ!"

"ఎంత పనయ్యింది! నా బాబు మచ్చలేని చంద్రుడనుకొన్నారా వెంకన్నా! ఇంత ఘోరం జరుగుతుం దని అనుకోలేదు.

"పోనీలేండి బాబూ! తమరు తలచుకొంటే క్షణంలో అన్నీ సద్దుమణిగి పోతాయి. రెండేళ్లంటే ఎంత! చిటికలో తిరిగిపోతాయి. బాబు తిరిగిరాగానే ఆ ఇద్దరినీ ఏకం చేస్తే..." మాట పూర్తి చేసేందుకు ధైర్యం చాలలేదు వెంకన్నకు.

కాని ఆ మాటకు రఘురామయ్య ముఖం వికసించింది. గుబురు మీసాల చాటున చిరునవ్వు తొంగిచూడసాగింది. "అవును. అలా చేస్తే బాగుంటుంది. నా చంద్రుడికి మచ్చ రావడం నేను సహించలేనురా. ఒక్కసారి నువ్వు వెళ్ళి ఆ అమ్మాయిని పిలుచుకు వస్తావా?"

వెంకన్న సంతోషంగా లేచాడు. కాని అంతలో ఏం తోచిందో వెంకన్నను వారించాడు రఘురామయ్య.

"ఆగు వెంకన్నా, తప్పు మనదై ఉండగా ఆ పిల్లని ఇక్కడకు పిలిపిం చడం ఏం బాగుంటుంది? మనమే వెడదాం టాక్సీని పిలు," అంటూ కండువా భుజానవేసుకుని ముందుకు దారితీశాడు.

* * *

కాలచక్రం గిఱ్ఱున తిరిగింది రెండేళ్లు గడిచిపోయాయి. చంద్రమోహన్ స్టేట్సులో చదువు పూర్తిచేసి విజయియై ఇంటికి తిరిగివస్తున్నాడు. కొడుక్కి ఘనమైన స్వాగతం యివ్వడం కోసం చక్కని ఏర్పాట్లు చేసి ఉంచాడు రఘురామయ్య.

చెయ్యవలసిన పనులు అందరికీ పురమాయించి వచ్చి సోఫాలో

కూర్చున్నాడు రఘురామయ్య. అంతలో తప్పటడుగులతో దోగాడుతూ తనవైపు వచ్చిన ఏడాది పసివాణ్ణి చూసి "రారా తాతా" అంటూ చేతులు చాపి దగ్గరకు పిలిచాడు.

"తాత! తాత!" అంటూ తనకై చాపి ఉంచిన చేతుల్లో దూకి గారాలు పోతున్న పసివాడిని చూసి "ఎవరు బావా వీడు" అని అడుగుతూ లోపలకు వచ్చాడు కామేశం.

హఠాత్తుగా వచ్చిన ప్రశ్నకు తబ్బిబ్బు పడిన రఘురామయ్య బావ మరిది ముఖంలోకి చూస్తూ "అరవింద కొడుకు" అన్నాడు.

టాక్సీలోని సామాను దింపించే హడా విడిలో పడిపోయిన కామేశం అప్పటికి మరేమీ ప్రశ్నించకుండా ఊరుకొన్నాడు.

కుశల ప్రశ్నలూ మర్యాదలూ అయ్యాయి భోజనాలు చేసి వచ్చి గదిలో పిచ్చాపాటి మాటాడుకొంటూ కూర్చున్నారు బావమరుదులు. దగ్గరలోనే కఱ్ఱ గుర్రం మీద ఊగుతూ ఆడుకొంటున్నాడు పసివాడు.

యదాలాపంగా గదినంతటిని కలయ జూస్తున్న కామేశం చూపులు ఒక ఫొటో పైన నిలచి అక్కడే ఆగిపోయాయి. ఫొటోవైపూ ఆటలో లీనమైఉన్న పసి వాని వైపు మార్చి మార్చి చూస్తున్న బావమరది ఉద్దేశ మేమిటో తెలియక చెపుతున్న మాట మధ్యలోనే ఆపేసి మౌనంగా ఉండిపోయాడు రఘురామయ్య.

"చూడు బావా! ఆ ఫొటో మన చంద్రానిది కదూ?" గోడమీది ఫొటో వైపు చూపిస్తూ అడిగాడు కామేశం.

"అదేమిటి బావా! ఆ ఫొటో మీ ఇంట్లోనూ ఉందిగా. ఏడాది పుట్టిన రోజు నాడు వాళ్లమ్మ పట్టుపట్టి తీయించింది" అంటూ ఆ ఫొటో గోడనుండి తీసి కామేశానికి అందించబోయాడు రఘురామయ్య.

కాని కామేశం దాన్ని అందుకోలేదు. ఆడుకొంటున్న పసివాడివైపు వేలు చూపిస్తూ "మరి ఈ ఫొటో" అని అడిగాడు.

తీక్షణంగా వినవచ్చిన ప్రశ్నతో వెన్ను చరచినట్లై అంతలోనే తమాయించుకొని, "ఇదీ చంద్రానిదే" అన్నాడు శాంతంగా రఘురామయ్య.

"ఔను నేనూ అదే అనుకొన్నా. అవే కనుముక్కుతీరు, అదే పోలిక! అంతా అదే ముద్ర. ఆ ఫొటోలో ఉన్న చంద్రానికి వీడికి ఏమీ తేడాలేదు. అప్పు డప్పుడూ వినిపించిన మాటల్ని కిట్టని వాళ్ళు కల్పించిన దూమరుస్సు అని కొట్టి పారేశా! హుం."

తీక్షణంగా తనవైపే చూస్తూ మాటాడుతున్న కామేశాన్ని, మాట మాటకూ కదలుతున్న అతని బారు మీసాల్ని చూసి ఝడిసిన పసివాడు ఆట

మాని ఒక్కసారిగా 'బాపురు' మన్నాడు. కొడుకు ఏడుపు వినిపించగానే ఒక్క పరుగున వచ్చి వాడిని ఎత్తుకొని వెళ్లింది అరవింద.

"అరవిందంటే ఆ అమ్మాయేనా? మీ ఆఫీసులో చూసిన జ్ఞాపకం. టైపిస్టు కదూ?'' అడిగాడు కామేశం.

'ఔను, రెండేళ్ల క్రితం మన ఆఫీసులో పనిచేసేది, ఇప్పుడింక అదేమీ లేదు, ఇక్కడే ఉంటోంది.''

''పెళ్ళి కూడా చేసుకొన్నాడా?''

''ఇంకా లేదు. వాడు రాగానే ఏ గుళ్లోనో ఆ మూడుముళ్లూ వేయించి..."

రఘురామయ్య మాట పూర్తి అవ్వక ముందే ''ఏమిటీ!'' అంటూ లేచాడు కామేశం ''వాడు భ్రష్టుడైనది చాలక ఆ సంతంతా ఇక్కడ ఉంచి వెళ్లాడా? వాడికి బుద్ధి ఎలాగా లేదు, నీకు మతికూడా లేకుండా పోయిందేమి పాపం! ప్రతి కులటా....''

"అబ్బ! ఆపరా కామేశం. నన్ను పూర్తిగా చెప్పనియ్యి. ఆ అమ్మాయి అయినింటి ఆడపిల్ల. తండ్రి చిన్న తనంలోనే పోతే గతిమాలి ఉద్యోగంలో చేరింది. అంతే కాని నీతిమాలినది కాదు. నీతిమాలి ప్రవర్తించినవాడు నీ మేనల్లుడు. ఆ తప్పు దిద్దవలసినవాడిని నేను. అదీ కథ ఓపిక ఉంటే అంతా చెపుతా విను" అంటూ తను విన్నదంతా ఏకరువుపెట్టాడు రఘురామయ్య..

అంతా విని పగలబడి నవ్వాడు కామేశం

"ఓష్ ఇంతేకదా! వెంకన్న మాటమీద ఇంత బ్రహ్మాండం చేశా వన్నమాట! అసలు ఇందులో నిజ మెంతో! వాడు ఈ వి ష యా లు వ్రాస్తాడా ఎప్పుడైనా?"

బావమరిది నవ్వుతో డీలాపడిన ర ఘు రా మ య్య "నాకు అంతా తెలుసన్నది వాడికి తెలియదు కదా! వచ్చాక నెమ్మదిగా చెప్పవచ్చు లెమ్మని నేనూ ఏమీ వ్రాయలేదు" అన్నాడు.

"అయినా నీ కింత బులబాటం ఏమిటి బావా? చంద్రం మైనర్ కాదు. వాడి జీవితాన్ని నిర్ణయించుకొనే హక్కు వాడికి ఉంది. నౌఖరు మాటలు పట్టుకొని నువ్వింత ఆర్భాటం చెయ్యడం నాకేమీ బాగా లేదు."

"వెంకన్న నంత పరాయివాడుగా తీసెయ్యకు కామేశం. చంద్రాన్ని ఇంతప్పటినుండి ఎత్తుకు పెంచింది వాడే. అబద్ధాలు చెప్పేపని వాడి కేముంది?"

అంతవరకు గుమ్మంలోనే నిలబడి వీళ్ళ సంభాషణ అంతా వింటున్న చంద్రంతల్లి కల్పించుకొని చెప్పింది, "తమ్ముడు చెప్పినదాంట్లో తప్పేముంది? మీ మంచి, మీ నౌకరు మంచి ఆలో చించుకుంటున్నారే కాని, తన భార్యను ఎన్నుకొనేపాటి స్వతంత్రమైనా తనకు

ఇవ్వకపోతే చంద్రం ఏమనుకొంటాడో నని ఎప్పుడైనా ఆలోచించారా! ఇన్నాళ్ల సహచర్యంలో నే నెప్పుడూ నోరువిడిచి మిమ్మల్నేమీ అడిగింది లేదు. ఈ ఒక్కటే కోరుకొంటున్నా —చంద్రానికి మీరేమీ చెప్పిపెట్టవద్దు. వాడు తప్పుచేస్తే వాడే దిద్దుకొంటాడు. వాడి స్వేచ్ఛకు అడ్డురానని మాట ఇవ్వండి" అంటూ చేయి చాపింది రాజేశ్వరి.

* * *

పేకాట జోరుగా సాగిపోతోంది. మేనమామా మేనల్లుళ్ళ మధ్య మంచి పోటీ వచ్చింది ఆట రసకందాయనంలో పడింది. ఇంతలో తప్పటడుగులతో ఇల్లంతా తిరుగుతూ అటుగా వచ్చిన పసివాడు గడప దాటలేక బోరగిలా పడ్డాడు. చేతిలోని పేక బోర్లించి ఒక్క అదుటున వెళ్ళి వాణ్ణి సందిట చేర్చుకొని ఓదార్చడం మొదలుపెట్టాడు చంద్రమోహన్. అది చూచి కామేశం అసహనంతో చేతిలో పేక నేలకేసి కొట్టి లేచి నిలబడ్డాడు.

గుమ్మాలెక్కి లోనికి వస్తున్న వెంకన్న సంతోషంతో పసివాడిలా కేరింతలు కొట్టాడు —

"నాన్నగారు తమరు వస్తున్నారని వ్రాస్తే వెంటనే బయలుదేరి వచ్చేశా. వచ్చినందుకు నా కళ్ళు చల్లబడ్డాయి. బుల్లిబాబు అంతా తమ పోలికే. చిన్న బాబూ! ఆ అమ్మ తమ పక్కన నుంచుంటే కళ్ల కరువుతీరా..."

వెంకన్నను మాట పూర్తిచెయ్యనివ్వ లేదు కామేశం. మధ్యలోనే తన కల్పించుకొని "సరి సరి, వెంకన్నా! ఎప్పుడొచ్చావు? పెద్దముండావాడివి, అమ్మగారు నీ కోసమే చూస్తోంది. వెళ్ళి కాస్త ఎంగిలిపడిరా. మాటలకేం తరువాత చెప్పుకోవచ్చు వెళ్ళు" అంటూ తొందరపెట్టి అతన్ని పెరటి వైపుకు పంపేశాడు.

"ఏమిటి మామయ్యా వెంకన్న చెబుతున్నది?" అని అడిగాడు చంద్రమోహన్.

"బాగానే ఉంది నీ ప్రశ్న! వెర్రి వాడి మాటలకు భాష్యం చెప్పడం నా తరమా! ఈ మధ్య వాడికి మతి చలించింది. వయసూ అయిపోయింది. అందుకే మీ నాన్న వాడికి "నెలకింత" అని ఏర్పాటుచేసి కొడుకు దగ్గరకు పంపేశాడు."

"అయ్యో! పాపం!" అని నిట్టూర్చాడు చంద్రం.

చంద్రమోహన్ పసివాణ్ణి కిందకు దింపకుండగా ఎత్తుకొనే ఉండడం కామేశానికి ఉడుకెత్తిస్తోంది. కాని పైకి తేలకూడని పరిస్థితి. గుంభనంగా "అదేమిటిరా చంద్రం! వాణ్ణి అలాగే ఎత్తుకొని ఉండిపోయావు! బట్టలు

ముఠికి చేస్తాడు. క్రిందకు దింపేయ్. ఇంటికి పోతాడు.

"నువ్వు కాస్త స్టేషన్‌కి వెడితే నే నొక్క క్షణం కునుకుతీస్తా. మెయిల్లో మంజుల వస్తుంది. నువ్వు దానిని రిసీవు చేసుకొంటే నాకు ఎంతో ఉకారంచేసిన వాడి వవుతావు" అన్నాడు సోఫాలో వాలి కళ్ళు మూసుకొంటూ.

మేనమామ ఆ పసివాని యెడల అంత నిర్దయగా మాటాడడం నచ్చలేదు చంద్రమోహన్‌కి. వాడిని ఎత్తుకొనే వంటగది వైపుగా వెళ్ళాడు.

మధ్యాహ్నం టిఫిన్ చెయ్యడానికి సంబారాలు సమకూర్చుతూ అలమారు దగ్గర నిలబడి ఉంది అరవింద. తల్లిని చూడగానే "అమ్మ అమ్మ అంటూ గుంజుకోడం మొదలుపెట్టాడు పసివాడు. ఆ సందడికి వెనుదిరిగిన అరవింద చూపులు చంద్రమోహన్ ముఖంమీద క్షణం తారాడాయి. వెంటనే తలవంచు కొని పక్కగదిలోకి వెళ్ళిపోయింది.

అంతలో రాజేశ్వరమ్మ లోపలకు వచ్చింది. పసివాణ్ణి చూ పు తూ "అమ్మా ఎవడే ? వీడు మన ఇల్లంతా సందడిచేస్తూ ఇంత ముద్దుగా తిరుగు తున్నాడు" అని అడిగాడు చంద్ర మోహన్.

తెల్లబోయింది రాజేశ్వరి. చివరకు "వీడా ? వీడు అరవింద కొడుకు" అంది.

ఔను. అరవింద. తను ఇందాకా చూసింది అరవిందనే. తమ ఆఫీసులో టైపిస్టు. అప్పటి చలాకీతనం లోపించడం వల్లనో ఏమో తను వెంటనే ఆనవాలు పట్టలేకపోయాడు. ఈమాటు కనిపిస్తే తన కృతజ్ఞత చెప్పాలి. ఆమె థీసిస్ ఎంత చక్కగా టైప్ చేసింది. అనుకొన్నాడు చంద్రం.

"ఒరే చందూ ! వాళ్ళ వీళ్ళ పిల్లలు నీకెందుకురా. త్వరలోనే నీ పెళ్ళి జరిపిం చెయ్యాలి అనుకొంటున్నాను. మంజూ చదువుకూడా అయిపోయింది. మామయ్య ఏకంగా ముహూర్తం పెట్టించుకొని వెళ్ళడానికే వచ్చాడు." అని రహస్యంగా మందలించింది రాజేశ్వరి.

"మావయ్య అంతస్తుకి మనం ఎప్పుడు ఎ ది గా మ మ్మా ?" అ డి గా డు చంద్రమోహన్.

"అదేమిటిరా ! మొ ద టి నుం డి పెట్టినా, తిట్టినా వాళ్లే కదురా మనల్ని ఆదుకొన్నది ! మంజు చిన్నతనంచేత కొంచెం పెంకిగానే ఉండేదనుకో, కాని ఇప్పుడు పెద్దదయ్యిందిగా, చాలా మారింది. కాసేపట్లో వస్తుంది కదా, నువ్వే చూద్దువుగాని."

"అమ్మా ! నాన్న ఏరి ? నేను వచ్చాక కాసేపు కనిపించారు, అంతే. మళ్ళీ ఆయనతో మాటాడడమే పడలేదు. ఎక్కడకు వెళ్లారు ?"

"ఏమో ! కన్నబిడ్డకు ముఖం తప్పించి తిరగవలసిన పని ఏమి

వచ్చిందో ఆయనకు ! ఒక్కగా నొక్క కొడుకువి, నీ బాగుకోసం..."

ఇంకా ఆమె మాట పూర్తవ్వకముందే "ఏరా ! నువ్వింకా ఇక్కడే ఉన్నావా!" అంటూ వచ్చాడు కామేశం

"ఇదిగో, ఇప్పుడే వెడతా" అంటూ బయలుదేరాడు చంద్రమోహన్.

"వాడిని ఇక్కడ దించి వెళ్ళరా" అంటూ వెనుకనుండి కేకేసింది రాజేశ్వరి.

"వంటగది పిల్లలు ఆడుకొనే చోటు కాదమ్మా, మళ్ళీ ఏదైనా దెబ్బతగుల్చుకో గలడు" అంటూ పసివాడిని ఎత్తుకొనే వెళ్ళిపోయాడు చంద్రమోహన్

* * *

మంజుల వచ్చినదగ్గరనుండి క్షణం విడవకుండా చంద్రమోహన్‌ని అంటి పెట్టుకు తిరుగుతోంది. ఆరోజు తరువాత అరవింద మళ్ళీ అతనికి కనిపించలేదు. పసివాడు ఇంతవరకటిలా ఇంట్లో తిరగటం లేదు. కాని అరవిందని చూసినది మొదలు అతనిలో ఏవేవో జ్ఞాపకాలు తెరలుతెరలుగా పుట్టి అతని మనసును కలత పెడుతున్నాయి ఆమెను గురించి తెలుసుకోవాలన్న తహతహ బయలు దేరింది అతనిలో.కాని ఎవరినీఅడగడం?

వెంకన్న కోసం వెతికిన చంద్రమోహన్‌కి అతడు ఆ రోజునే వెళ్ళి పోయాడని తెలిసింది. తీరికగా తనతో మాటాడకుండగా వెళ్లిపోయినందుకు బాధపడినా స్థిరంలేని మనిషి కదా అని సరిపెట్టుకొన్నాడు.

ఆ రోజు మంజుల సినిమా ప్రోగ్రాం పెట్టింది. ఎంతకీ ఆమె ముస్తాబు తెమలక పోవడంతో కొంచెంసేపు తోటలో తిరిగి రావాలనిబయలుదేరాడు చంద్రమోహన్. పొన్నచెట్టు తిన్నెమీద కూర్చొని తల వంచుకొని జాజిపూలు మాలగాకడుతోంది అరవింద. ఆ సమీపంలోనే ఆడు కొంటున్నాడు పసివాడు. ఆ అవకాశాన్ని జారవిడుచుకోదలచలేదుచంద్రమోహన్. ఆమెను సమీపించి-

"మీరు-మీరు అరవింద కదూ" అన్నాడు.

అనుకోని పలకరింపుకు తబ్బిబ్బై ఉలికిపాటుతో లేచినిలబడింది అరవింద.

"మీరు సరిగా సమయానికి థీసిస్ అందించారు. అప్పుడు మీకు నేను సరిగా థాంక్సయినా చెప్పలేదు. క్షమించాలి" అన్నాడు.

అంతలో మంజుల పడిగాలిలా దూసుకువచ్చి "ఏమిటీ ! ఇంకా మాల కట్టనే లేదూ ! పోనీ; అయిన మట్టుకు ఇవ్వు,చాలు" అంటూ అరవింద చేతిలోని మాలను లాక్కొని జడలో తురుము కొంది.

హతాశురాలైన అరవింద నీరు నిండిన కళ్లతో ఒక్క క్షణం చంద్రమోహన్ వైపు చూసి తలవాల్చి పసివాడి వైపుగా నడిచిపోయింది.

"రా బావా! అసలే ఆలస్యమయిపోయింది అనుకొంటూంటే నీకోసం వెదకడం ఒక పనైపోయింది" అంటూ చనువుగా అతని నడుముచుట్టూ చెయ్యి వేసి నడిపించుకుపోయింది మంజుల.

* * *

"అవే కళ్ళు! అదే చూపు!! ఈ రెండు సంవత్సరాలు తన్ను అనుక్షణం వెంటాడినవి ఈ చూపులే. దిగులు, భయము, తిరస్కారము-ఒక్క చూపులో ఎన్ని భావాలు!!!"

మంజులతో సినిమాకు వెళ్ళాడన్న మాటేగాని చంద్రమోహన్ దృష్టి తెరపై నిలువలేదు. అతనికి ఆ క్షణం అరవిందే గుర్తుకు రావడం మొదలుపెట్టింది. మస్తిష్కంలోని మారుమూల గవాక్షాలు తెరుచుకొని ఏవేవో జ్ఞాపకాలు తొంగి చూడడం మొదలుపెట్టాయి.

ఆ రాత్రి ఇంటికి వచ్చి పడుకొన్నాడన్నమాటేగాని అతనికి నిద్ర పట్టిందిలేదు. క్రమంగా అతని ఆలోచనలు ఒక రూపం దాల్చడం మొదలుపెట్టాయి. ఆ నీరవ నిశీధిని చీల్చుకొంటూ "అయ్యో! వదలండి, నేను-నేనుఅరవిందను. నన్ను విడిచిపెట్టండి," అన్న ఆర్తనాదాలు గుండె లవియజేస్తూ వినవచ్చాయి. పశ్చాత్తాపంతో అతని హృదయం దహించుకుపోయింది. భ్రాంతితో నిండి ఉన్న అతని మనసుకు తిరిగి ఆనాటి సంఘటనలు ప్రత్యక్షం కావడం మొదలుపెట్టాయి. జాలిగా, దీనంగా రక్షించమని ప్రార్థిస్తూ తనవైపు చూస్తున్న ఆ కళ్లు, అంతులేని అసహ్యాన్ని, దుఃఖాన్ని వెదజిమ్ముతున్న ఆ చూపులు, అసహాయతతో అదరే పెదవులు, కందిపోయిన చెక్కిళ్ళ వెంట ధారగా కారిపోతున్న కన్నీరు, సుకుమారమైన చేతులు ముందుకు చాపి తన దశ్చర్యలను అరికట్ట ప్రయత్నించే ఆమె రూపం అతని కనులకు కట్టింది. "అరవిందా!" అంటూ ఆక్రోశించాడు చంద్రమోహన్

ఆదరంతో అక్కున జేర్చుకొని ఆకలి తీర్చేవారు కనిపించక ఏడుస్తూ ఇల్లంతా తిరుగుతున్న పసివాణ్ణి, అప్పుడే లేచివచ్చిన మంజుల నిద్రాభంగమయ్యిందన్న కసితో "వెధవ పోరు అప్పుడే మొదలయ్యింది" అని కసురుతూ చెయ్యెత్తి అదిలించబోయింది. కాని అంతలోనే "ఆగు" అన్న గద్దింపు వినరావడంతో కంగారుగా ఎత్తినచెయ్యి దించేసి తెల్లబోయి చూసింది.

ఒక్క పరుగున వచ్చి పసివాణ్ణి రెండుచేతులా ఎత్తి గుండెలకు హత్తుకొని ఓదార్చసాగాడు చంద్రమోహన్. ఆ సందడికి గదిలోనుండి బయటకు వచ్చాడు రఘురామయ్య.

"నేను చెయ్యరాని అకార్యం చేశానని ఇప్పటికి గాని తెలుసుకోలేకపోయా. నన్ను క్షమించి నా తప్పు దిద్దుకొనే అవకాశం నాకియ్యండి నాన్నా" అన్నాడు

తండ్రిదగ్గరకు వస్తూ. రఘురామయ్యకు అంతా అర్థమయింది. తనంత ఉన్నతంగానూ ఎదిగిపోయిన కొడుకు ముఖంలోకి వెర్రిగా చూసి "అపకారం చెయ్య జారిపోయింది బాబూ!" అన్నాడు అతని కనుకొలుకుల్లో రెండు బాష్ప బిందువులు తళుక్కుమన్నాయి.

"నాన్నా! ఏమిటి మీరు అంటున్నది" ఆక్రోశించాడు చంద్రమోహన్.

రఘురామయ్య మరి మాటాడకుండా జేబులోనుండి నలిగిపోయిఉన్న కాగితం మడతతీసి కొడుక్కి అందించాడు.

"మామయ్యగారూ-అని పిలిచే చనువు మీరు నాకు ఇచ్చారు. ఆ ఆత్మీయతతోనే కలకాలం మీరు నన్ను జ్ఞాపకం ఉంచుకో గలరని నాకు తెలుసు.

గాజు పూసవంటి ఆడబ్రతుకు ఒకసారి చితికిపోతే మరి అతుకబడదు మీరు ఔదార్యంతో నా బ్రతుకు బాగు చెయ్యాలని చూశారు కాని అది మీ గృహ ఛిద్రాలకు దారితియ్యడం నేను సహించలేను.

నేను ఎవరికోసం బ్రతకడం తప్పనిసరి అనుకొన్నానో వాళ్ళను గురించిన చింత ఇంక నాకు లేదు ప్రసాద్, కల్యాణి మీ చల్లని నీడలో మంచి జీవితాన్నే అందుకోగలరన్న ధైర్యం నాకు ఉంది. ఇంక పసివాడా-వాడు మీవాడే.

ఇక ఉంటా

నమస్కారములతో అరవింద."

"అరవిందా!" అంటూ దుఃఖంతో కుప్పకూలిపోయాడు చంద్రమోహన్.

* * *

"మీ రిచ్చిన టెలిగ్రాం ఆ మన్యం చేరుకొనేందుకు మూడురోజులు పట్టింది. అందగానే బయలుదేరినా మరి మూడు రోజులు సాగింది నా ప్రయాణం. నిజంగా మీరు పూనుకొని నా బాబును నాకు దక్కించారు."

"మేము చేసినదెంత. అంతా ఈమే. చేసింది. ఉద్యోగానికైతే నర్సుగాని, బాబును కన్నతల్లిలా ప్రతి క్షణం కనిపెట్టిఉండి సేవచేసింది."

బాబును నిద్రపుచ్చి వంగి దుప్పటి సరి చేస్తున్న నర్సు దగ్గరతో సరళ మాటలు వినిపించేసరికి వెనుదిరిగి చూసింది. కాని తనకు ఎదురుగా నిలచిఉన్న వ్యక్తిని చూడగానే ఆమె ముఖంలో రంగులు మారాయి. క్షణంలో సగం అతని ముఖంలోకి చూసి చూపులు మరల్చుకొని రెండడుగులు వెనక్కి వేసింది.

"అవే కళ్ళు! సంవత్సరాల తరబడి నా మనసు నంతటిని ఆక్రమించుకొని ఉన్న ఆ కళ్ళను నేనెలా మరచి పోగలను" అంటూ గొణుక్కున్నాడు చంద్రమోహన్.

"నన్ను క్షమించగలవా అరవిందా" అంటూ తన చేతులను అందుకొని దీనంగా క్షమాభిక్ష నర్థిస్తూ తనవైపే

చూస్తున్న చంద్రమోహన్‌ని కాదనలేక పోయింది అరవింద.

"మరి పెళ్ళిమాట తలపెట్టకుండా బిడ్డతోడిదే లోకంగా బ్రతుకుతున్నాడు మానవుడు!" అన్న సరళ మాటలు జ్ఞప్తికివచ్చి తెరిపినపడ్డట్టయింది ఆమె మనసు.

పరిసరాలను మరచి, తమ్ము తామెరుగకుండా పెనవేసుకుని గుండెల బరువు తీరా దుఃఖిస్తున్న ఆ జంటను చూసి "హాపీ రియూనియన్" అంటూ కొంగుతో కళ్లు ఒత్తుకుంది సరళ.

అప్పుడే అక్కడకు వచ్చిన మేట్రన్ "మరే! నేను చెపితే ఒక పట్టాన నమ్మిందికాదు చచ్చిపోడానికి దూకితే సముద్రం ఒడ్డుకు కొట్టేసింది పుణ్యాత్ములెవరో తెచ్చి ఆసుపత్రిలో చేర్పించారు చావుబతుకులతో పోరాడి మొత్తానికి బ్రతికింది. ఎందుకు బతికించారంటూ గోలచేసింది. ముందు ముందు ఏమి యోగముందో చావు తప్పింది. అని బలవంతాన నచ్చజెప్పి నా దగ్గరే ఉంచుకొని నర్సు ట్రైనింగులో చేర్పించా.

ఇన్నాళ్లకు ఆ దేవుడికి దయకలిగింది. అయినవాళ్ళు తా ఒకటయ్యారు. నా బాధ్యత తీరింది" అంటూ చేతులు జోడించింది.

విజిటింగ్ అవర్సు పూర్తి అయిన దానికి గుర్తుగా ఆసుపత్రి గంట గణగణా మ్రోగింది.

* * *

శిశిరం గడిచిపోయింది. వసంతం ముదిరింది. చల్లగాలికోసం తపించి పోతున్న జనం ఆరుబయట పక్కలు పరచుకొంటున్నారు.

ఆవేళ వైశాఖ పూర్ణిమ. చల్లదనాన్నిచ్చే వెన్నెల అంతటా పరుచుకొని ఆహ్లాదకరంగా ఉంది డాబామీద పరచబడి ఉన్న పరుపుమీద పడుకొని ఉన్నాడు చంద్రమోహన్. తండ్రి ప్రక్కన పడుకొన్నాడు కొడుకు.

అంతలో మల్లెల వాసన మగువ రాకను సూచించగా లేచాడు చంద్రమోహన్. చప్పుడుకాని అడుగులతో అతనిని సమీపించిన అరవింద "చంద్రుడు బాగున్నాడు కదూ" అంది కొంటెగా.

చేయిచాపి ఆమెను చేరదీసుకొంటూ, "ఆ మచ్చకనక లేకపోతే ఇంకెంత బాగుండేవాడో" అంటూ నిట్టూర్చాడు చంద్రమోహన్.

"అది మచ్చకాదు, కుందేలు పిల్ల. తాతయ్య చెప్పాడు" అంటూ లేచి వచ్చాడు బాబు.

"ఓరి! నువ్వింకా నిద్రపోలేదా" అంటూ కొడుకును ఎత్తుకొన్నాడు చంద్రమోహన్.

"శశాంకుడు అందగాడే" అంటూ తృప్తిగా నవ్వుకొంది అరవింద.

———